హెపటైటిస్‌ను అశ్రద్ధ చేయొద్దు

- ప్రతి ఏడాది పెరుగుతున్న కేసులు
- ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స చేయవచ్చు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం

'గుంటూరు శ్రీనగర్‌కు చెందిన 30 ఏళ్ల భానుప్రసాద్‌కు ప్రతిరోజూ మద్యం తాగే అలవాటు ఉంది. అర్ధాంతరంగా ఒకరోజు కళ్లు పసుపురంగులోకి మారిపోయాయి. వెంటనే గ్యాస్ట్రో ఎంట్రాజిస్టు వద్దకు వెళ్లాడు. వైద్యుడు పరీక్షలు చేసి లివర్ పూర్తిగా పాడైందని, లివర్ మార్పిడి చేసిన బతకటం కష్టమని చెప్పటంతో కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. లివర్ సమస్యలను ముందస్తుగా గుర్తించకుంటే మృత్యువాత పడాల్సిందే.



గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్-బీ, హెపటైటిస్-సీ వ్యాధితో 304 మిలియన్ల మంది బాధపడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం 1.3 మిలియన్ల మంది క్రానిక్ హెపటైటీస్‌తో చనిపోయారు. ప్రతి ఏడాది ప్రతి 30 సెకన్‌లకు ప్రపంచ వ్యాప్తంగా ఒకరు హెపటైటీస్ సంబంధిత వ్యాధితో మరణిస్తున్నారు. వ్యాధి సోకినవారిలో 90శాతం మంది ప్రజలకు వ్యాధిపై, వైద్య చికిత్సలపై అవగాహన లేదు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తపడొచ్చని గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం...
హెపటైటిస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. వైరస్ ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. వైరస్ శరీరంలోకి ఒకసారి వస్తే లివర్‌ను దెబ్బతీస్తుంది. వ్యాధిలో ఏ, బీ, సీ, డీ, ఈ రకాలు ఉన్నా వాటిలో బీ, సీ ప్రాణాంతకం. గుంటూరు జీజీహెచ్‌లో 2021 నుంచి ప్రత్యేకంగా హెపటైటిస్ స్క్రీనింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు...
కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా రావడం. కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, వాంతులవ్వటం, వ్యక్తి బాగా బలహీనపడటం, కీళ్ల నొప్పులు ఉంటాయి. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది.

వ్యాధి సోకే విధానం...
ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తుల ద్వారా, శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా(వీర్యం, యోని స్రవాలు, మూత్రం) సురక్షితం కాని సంభోగం ద్వారా, అనేక మందితో సంభోగం చేయటం ద్వారా ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం ద్వారా వ్యాధి సోకే ప్రమాదం ఉంది. టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవులు కుట్టుకోవటం, ఒకరేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం, అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరల్ కలిగిన గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటిస్-బీ, సీ వ్యాధులొస్తాయి.

బాధితుల వివరాలు....

గుంటూరు జీజీహెచ్‌లో 2022లో హెపటైటిస్-బీ 544 మంది, హెపటైటిస్ సీ 130 మందికి ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. 2023లో హెపటైటిస్- బీ 354 మంది, హెపటైటిస్- సీ 151 మంది ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. 2024లో హెపటైటిస్- బీ 433 మందికి, హెపటైటిస్- సీ 175 మందికి ఉన్నట్లు నిర్ధారించారు.

హెపటైటిస్‌కు వ్యాక్సిన్‌తో చెక్‌పెట్టవచ్చు



హెపటైటిస్- బి వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవాలి. ఈ వ్యాధికి వ్యాక్సిన్ ఉంది కాని వ్యాధి వచ్చాక నయం కాదు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. హెపటైటిస్-సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు కాని వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు.

డాక్టర్ ఎ.కవిత, గ్యాస్ట్రోఎంట్రాలజి విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

లివర్ క్యాన్సర్‌కు దారితీస్తోంది....



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్- బీ, సీ వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా హెపటైటిస్ వ్యాధి ఉందా లేదా అని తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారితీయవచ్చు. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

డాక్టర్ బి.స్రవంతి, క్యాన్సర్ వైద్యనిపుణులు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్‌లో హెపటైటిస్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. 2020 నవంబరులో ప్రారంభించాం. ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో ఉచితంగా చేస్తున్నాం. వైద్య పరీక్షలు చేసి హెపటైటిస్ నిర్ధారణ అయిన వారికి నెలకు సుమారు రూ.20 వేలు ఖరీదు చేసే మందులు ఉచితంగా అందిస్తున్నాం. హై రిస్క్ గ్రూపునకు చెందిన ప్రతి ఒక్కరూ ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

– డాక్టర్ నాగూర్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రోఎంట్రాలజీ, గుంటూరు జీజీహెచ్

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సమాచార కేంద్రం ప్రారంభం

నెహ్రూనగర్: కృష్ణా- గుంటూరుజిల్లాల పట్టభద్రుల(ఎమ్మెల్సీ) ఎన్నికలకు సంబంధించి గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటుకు నమోదు చేసుకున్న వారికి ఓటు వెరిఫికేషన్ కోసం గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమాచార కేంద్రాన్ని (0863 - 2345103) శుక్రవారం నుంచి ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్‌ఓలు ఓటు ఎక్కడ ఉన్నది, ఓటు ఎక్కడ వేయాలి తదితర వివరాలతో కూడిన ఓటర్ స్లిప్పులను గృహాలకు వచ్చి అందజేస్తున్నారని చెప్పారు. ఎవరికైనా ఓటర్ స్లిప్పులు అందకపోతే నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నుంచి ప్రత్యేకంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సదరు కేంద్రంలో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి రాలేని పక్షంలో కాల్ సెంటర్ 0863 - 2345103 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు ఎదగాలి

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ- విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. ఈసందర్భంగా డీఈఓ రేణుక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-ప్రైమరీ దశలో బలమైన పునాది వేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన తరువాత భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన విద్యా విధానాలను ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు బోధించాలని, ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. కోర్సు డైరెక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటి ద్వారా బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, రిసోర్స్ పర్సన్స్ బి.జ్యోతి, శైలజ, అనూరాధ, రమాదేవి పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు
చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు నిర్వహిస్తున్న తరగతులను డీఈఓ రేణుక పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి దశ ఎంతో కీలకమని, టెన్త్‌లో సాధించే మార్కుల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చునని వివరించారు. ఈసందర్భంగా ప్రీ-ఫైనల్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్ సహకారంతో రూ.500 చొప్పున నగదు అందజేశారు.

వైద్యులకు ఎముకల సాంద్రత పరీక్ష

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో గురువారం గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జీడీఏఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బందికి ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష (డెక్సా స్కాన్) శిబిరం నిర్వహించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సంఘం నేతలు, వైద్యుల సమస్యలపై ప్రభుత్వానికి వినతులు, పోరాటాలు చేస్తూ వైద్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు మాట్లాడుతూ రెండు రోజులు గుంటూరు జీజీహెచ్‌లో 220 మంది వైద్యులకు ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు చేశామన్నారు. ముంబాయికి చెందిన ఎలంబిక్ కంపెనీ సహకారంతో రూ.2,200 ఖరీదు చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం 120 మంది వైద్యులకు వైద్య పరీక్షలు చేశారని, శుక్రవారం కూడా వైద్య శిబిరం కొనసాగుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు అధ్యక్షురాలు డాక్టర్ వాసవి, సెక్రటరీ డాక్టర్ స్వరూప్‌కాంత్, యూనియన్ నాయకులు డాక్టర్ భానుకుమార్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ రాజా, డాక్టర్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉంటుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు తమ సర్వీసుకు సంబంధించిన సమస్యలు, కార్మికులు ప్రధానంగా పీఎఫ్, ఈఎస్‌ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను అందించవచ్చని పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో రూ.10 లక్షలతో ఆధునీకీకరించిన ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్‌ను గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి 1982లో వైద్య కళాశాలలో ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. సుమారు 43 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్ వైద్యులు ఉండేందుకు అనుకూలంగా లేకపోవడంతో గెస్ట్ హౌస్ నిధులతో ఆధునీకీకరించామని చెప్పారు. వైద్య పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వచ్చేవారు, వైద్య కళాశాలలో బోధన చేస్తూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు బయట ఉండే పనిలేకుండా కళాశాలలోనే ఆధునిక సౌకర్యాలతో ఫ్యాకల్టీ గెస్ట్ హౌస్‌ను ఆధునికీకరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్, గెస్ట్ హౌస్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ భానుకుమార్, డాక్టర్ స్వరూప్‌ఖాన్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: సోదరి చనిపోయిందని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన వడ్డి రవితేజ(32) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు భార్య, పది నెలల కుమారుడు ఉన్నారు. 2020లో కరోనాతో రవితేజ సోదరి పావని మృతిచెందింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన రవితేజ నిత్యం బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 17న హైదరాబాద్ వెళుతున్నానని చెప్పి గుంటూరు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అశ్విని లాడ్జిలో రూము అద్దెకు తీసుకుని పురుగు మందు తాగాడు. గురువారం గమనించిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి బావ మోపిదేవి రాగమౌనీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయండి



లక్ష్మీపురం: అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బి.వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి బాధితుల సమస్యల పరిష్కారించాలని కోరారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించాలని కోరారు. జప్తు చేసిన ఆస్తులన్నింటిని కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలన్నారు. ఎమ్మెల్యే ఆనంద బాబు స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, నాయకులు షేక్ కరిముల్లా, కోట మాల్యాద్రి, పెద రామయ్య, ప్రసాద్ బాబు, ఇన్నయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశ విద్రోహశక్తులకు అడ్డాగా దాచేపల్లి

గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లాలోని దాచేపల్లి గ్రామంలో జరిగిన ఛత్రపతి శివాజీ శోభాయాత్ర సందర్భంగా భారతదేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం చాలా దారుణమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ విద్రోహులకు దాచేపల్లి అడ్డాగా మారిందని పేర్కొన్నారు. హిందూ సమాజంపై ద్వేషాన్ని ప్రకటిస్తూ దాచేపల్లిలో బుధవారం శివాజీ శోభా యాత్రపై రాళ్లు రువ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఆలపాటికి మద్దతుగా మేధావుల సదస్సు



గుంటూరు మెడికల్: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతుగా అరండల్‌పేటలో డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు గురువారం నిర్వహించారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయాల్లో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ఆలపాటి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకి మేధావులతో సమావేశం పెట్టి వారి సూచనలను గవర్నమెంట్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.శేషారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు

గుంటూరు మెడికల్: ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టడంతో గురువారం బీజేపీ మహిళ నేతలు గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సంబరాలు చేసుకుని రేఖా గుప్తాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రి సుగుణ, జిల్లా కార్యదర్శి ఏలూరి లక్ష్మి, మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు సాధు వాణి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

లక్ష్మీపురం: అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో, శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వా నివారణ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రారంభించారు. స్థానిక పాత గుంటూరులోని పార్క్ సెంటర్ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాలాద్రి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలులో పార్టీలు విఫలం

లక్ష్మీపురం: రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు చేయడంలో రాజకీయ పార్టీలు పూర్తిగా విఫలమైనట్లు విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల తరువాత కూడా ఉచిత పథకాలపై ఆధారపడుతున్నామంటే మన పరిస్థితి అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

జంక్ ఫుడ్స్‌తో పొంచి ఉన్న కేన్సర్ ముప్పు

మహిళా శిశు అభివృద్ధి శాఖ జేడీ బత్తుల మనోరంజని

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారులను జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచడం ద్వారా కేన్సర్ మహమ్మారి నుంచి కాపాడుకోవచ్చునని మహిళా శిశు అభివృద్ధిశాఖ మిషన్ శక్తి జాయింట్ డైరెక్టర్ బత్తుల మనోరంజని పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ పబ్లిక్ స్కూల్ తొలి వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మనో రంజని మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. కేన్సర్ కేసుల నమోదులో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. కష్టపడి పనిచేస్తున్న మనం, పిల్లల్ని ప్రేమతో పలకరించి, వారిలో ఉత్సాహాన్ని, ప్రేమను నింపాలని చెప్పారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఉన్నత విద్యా ప్రమాణాలతో ఉత్సాహంగా పాల్గొని విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజ్, హై స్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు పాటు సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థి లోకానికి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ అందరికీ విద్య అందించాలనే సంకల్పంతో ఆధునిక బోధనా విధానాలను ఆకళింపు చేసుకుని ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ విద్యా అవశ్యకతను వివరించారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు విలువైన విద్యతో పాటు నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలిత, హిందూ కాలేజ్ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని షాపులు సీజ్ చేస్తాం

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



షాప్ వివరాలు తెలుసుకుంటున్న నగర కమిషనర్

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాప్‌లను సీజ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్ ని షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్‌లోని 5, 6 షాప్‌లను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారి మదన్ గోపాల్‌కు సూచించారు. కాంప్లెక్స్‌లో మొత్తం షాప్‌లు, అద్దె బకాయి ఉన్న షాప్‌లు, ఖాళీగా ఉన్న షాపుల వివరాలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కాంప్లెక్స్‌ల వివరాలను సమగ్ర నివేదిక రూపంలో అందించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆయన వెంట రెవెన్యూ అధికారి మదన్ గోపాల్, డీఈఈ రమేష్ బాబు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రాధాన్య క్రమంలో చేపట్టాలి
నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం సంగడిగుంట, ఎల్ఎల్ఆర్, పాత గుంటూరు, గణేష్ నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులైన రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ సమయాల్లోనే స్థానిక వార్డు సచివాలయ ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షణ చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఖాళీ స్థలాల సమస్యలపై ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్లు శుభ్రం చేయాలని స్పష్టం చేశారు.

శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనులపై సమీక్ష
నెహ్రూ నగర్: శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణానికి సంబంధించి గుంటూరు నగరపాలక సంస్థ నుంచి చేపట్టాల్సిన ప్రభావిత భవనాల తొలగింపు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, టీడీఆర్ బాండ్లు, నష్ట పరిహారాల పంపిణీ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ చాంబర్ లో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులపై జీఎంసీ చేపట్టాల్సిన పనులపై ఆదేశాలు జారీ చేశారు. 26 మందికి తాము కోల్పోతున్న భవనాలకు సంబంధించి నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు 25వ తేదీకి పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపిలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు నూతన పరికరాలు అందజేత

కొరిటెపాడు: ర్యాష్ డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న నియంత్రణ కార్యక్రమాలను వేదా సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అభినందించారు. బృందావన్ గార్డెన్స్, ఎన్టీఆర్ స్టేడియం కూడలి సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ నిబంధనల గురించి 24/7 అనౌన్స్‌మెంట్ చేసేందుకు అవసరమైన పరికరాలను గురువారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి దగ్గరగా ఉన్న గుంటూరు ప్రాంతం అభివృద్ధి చెందుతున్నందున నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని, వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గుంటూరు ట్రాఫిక్ పోలీసు అభ్యర్థన మేరకు వేదా సీడ్స్ పరికరాలను అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ డి.శ్రీహరి, శంకర్ నాయక్, రంగారావు, తేలప్రోలు వెంకటరావు, గాజుల సాయిరాం పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసులకు పరికరాన్ని అందజేస్తున్న తులసి ధర్మచరణ్

డాక్టర్ సుబ్బారావు సంస్మరణ సభ

గుంటూరు మెడికల్: విశ్రాంత జీజీహెచ్ సూపరింటెండెంట్ దివంగత ఎన్వీ సుబ్బారావు చౌదరి సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్ శుశ్రుతాహాలులో సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. సభలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ సర్జన్‌గా, ప్రొఫెసర్‌గా డాక్టర్ సుబ్బారావు అందించిన సేవలు మరువలేనవి పేర్కొన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి మాట్లాడుతూ ఒక సర్జన్‌గా తనకు స్ఫూర్తిని ఇచ్చిన వారిలో సుబ్బారావు చౌదరి ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ ఎన్.వి.ఎస్.ప్రసాద్(అమెరికా) పాల్గొన్నారు.



డాక్టర్ సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

23న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 23న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాలలో చెస్ టోర్నమెంట్ బ్రోచర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో విజేతలకు రూ.30,300 నగదు బహుమతితో పాటు ప్రత్యేక బహుమతులు అందజేస్తారని తెలిపారు. చదరంగ పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు టోర్నమెంట్ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్‌ను 97030 49378, 93913 39343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య, వెంకట్రావు

టెన్త్ విద్యార్థినులకు ఉపకార వేతనాలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం శ్రీచిట్లూరి రంగవల్లి తాయారమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైశ్య సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినులకు రూ.రెండు వేలు చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 20 మంది వైశ్య సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.రెండు వేలు చొప్పున ఉపకార వేతనం అందజేశామని తెలిపారు. ఏ పాఠశాలల్లో చదువుతున్నప్పటికీ పేద విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న శ్రీనివాసరావు